

ఓవర్‌లోడ్ వాహనాలు స్వాధీనం

బాగేపల్లి, జూన్ 10: నిబంధనలు ఉల్లంఘించి ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న భారీ లారీలను స్వాధీనం చేసుకున్నారు. ఓవర్‌లోడ్‌తో గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న మూడు లారీలను స్వాధీనం చేసుకున్నట్టు ఇన్‌చార్జ్ సీఐ నయాజ్‌బేగ్ వెల్లడించారు. బాగేపల్లి - చేళూరు మార్గంలో నిత్యం పదులసంఖ్యలో లారీలు అత్యధిక భారం కల్గిన గ్రానైట్ రాతి దిమ్మెలను తరలిస్తున్నాయి. శనివారం రాత్రి గస్తీ పోలీసులకు సమాచారం రావడంతో ఓవర్‌లోడ్ లారీను తనిఖీ చేశారు. నయాజ్‌బేగ్ మాట్లాడుతూ 66, 55, 54 టన్నుల బరువు ఉన్నట్టు గుర్తించామని ఆర్టీఓ, గనుల, భూ విజ్ఞానశాఖ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.


ఇద్దరు మాజీ సీఎంలకు

కేబినెట్‌లో దక్కని చోటు

- పలువురు సీనియర్ల ఆశలు గల్లంతు
- ఏడుసార్లు జిగజిణగి, ఐదుసార్లు గద్దిగౌడర్ లోక్‌సభకు ప్రాతినిధ్యం
- తొలిసారి ఎన్నికతోనే సోమణ్ణకు అవకాశం



బసవరాజ్ బొమ్మై




జగదీశ్ శెట్టర్

బెంగళూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కొలువుదీరింది. రాష్ట్రానికి గతంలో దక్కినట్టే మంత్రి పదవులు వరించాయి. కానీ సామాజిక కోణం, సీనియారిటీకి ప్రాధాన్యత లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. రాష్ట్ర కోటాలో ఐదుగురికి మంత్రి పదవులు దక్కినా కన్నడిగులు మాత్రం నలుగురే. రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యురాలిగా ఉన్న నిర్మలాసీతారామన్ కేంద్రంలో సుదీర్ఘకాలంగా కీలకశాఖల మంత్రిగా వ్యవహరించారు. ఇక కన్నడిగులలో నలుగురు మంత్రులయ్యారు. వీరిలో ప్రహ్లాద్ జోషి ఇప్పటిదాకా పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నవారే. ఇక శోభాకరంద్లాజె సహాయమంత్రిగా కొనసాగుతున్నారు. జేడీఎస్ పార్టీతో పొత్తు ఉండడంతో కుమారస్వామికి కేబినెట్ హోదా వరించింది. ప్రస్తుతం కేంద్ర కేబినెట్‌లో రాష్ట్రానికి చెందినవారిలో సామాజిక పరంగా నిర్మలాసీతారామన్, ప్రహ్లాద్ జోషి బ్రాహ్మణ సామాజికవర్గం కాగా కుమారస్వామి, శోభాకరంద్లాజె ఒక్కలిగ సామాజికవర్గానికి చెందినవారు. అనూహ్యంగా కేబినెట్‌లో సహాయమంత్రిగా చేరిన వి. సోమణ్ణ లింగాయత సామాజికవర్గానికి చెందినవారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రులుగా వ్యవహరించి లోక్‌సభకు ఎన్నికైన బసవరాజ్ బొమ్మైకు కేబినెట్‌లో చోటు ఉంటుందని ప్రచారం జరిగింది. దాదాపు ఆయన పేరు రెండు మూడు రోజులు హల్‌చల్ చేసింది. ఆయనకు చోటు కల్పిస్తే కేబినెట్ హోదా ఇవ్వాల్సి ఉంటుందని వెనుకడుగు వేసినట్టు తెలుస్తోంది. జగదీశ్‌శెట్టర్ కూడా ముఖ్యమంత్రితోపాటు పలు పదవులు అలంకరించారు. ఆయనకు అవకాశం ఇస్తే కేబినెట్‌లోకి తీసుకోవాల్సి ఉంటుంది. పీసీ గద్దిగౌడర్ బాగల్కోట నుంచి వరుసగా ఐదుసార్లు గెలుపొందారు. పైగా వెనుకబడిన ఉత్తరకర్ణాటకకు చెందినవారు. వీటన్నింటితోపాటు లింగాయత సామాజికవర్గానికి చెందినవారు. కానీ ఇద్దరు మాజీ సీఎంలను కాదని అదే సామాజికవర్గానికి చెంది తొలిసారి ఎంపీ అయిన సోమణ్ణకు బెర్త్ ఖరారు చేశారు. తద్వారా లింగాయత సామాజిక వర్గానికి కేంద్ర కేబినెట్‌లో అవకాశం ఇచ్చినట్టయ్యింది. బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు అవకాశం ఇవ్వకపోవడం విమర్శలకు కారణమవుతోంది. రమేశ్ జిగజిణగి వరుసగా ఏడుసార్లు ఎంపీగా విజయం సాధించారు. 2014లో మోదీ ప్రభుత్వంలో సహాయమంత్రిగా వ్యవహరించారు. ఆయనకు ఈసారి మొండిచేయి మిగిలింది. జనతా పరివార్ నుంచి రాజకీయాలు ప్రారంభించిన రమేశ్ జిగజిణగి చిక్కోడి స్థానం నుంచి మూడుసార్లు, ఆ తర్వాత విజయపుర రిజర్వు నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు గెలుపొందారు. రాష్ట్ర బీజేపీలో మరో సీనియర్ నేత గోవింద కారజోళ సొంత నియోజకవర్గం కాకున్నా చిత్రదుర్గ రిజర్వు స్థానం నుంచి గెలుపొందారు. ఇదే స్థానం నుంచి ఎంపీగా కొనసాగిన నారాయణస్వామి కేంద్రమంత్రిగా వ్యవహరించారు. అదే కోవలోనే గోవింద కారజోళకు అవకాశం ఉంటుందని పార్టీ వర్గాలు భావించాయి. రాష్ట్రంలో పలు శాఖల మంత్రిగా, డీసీఎంగా కారజోళ వ్యవహరించారు. వరుసగా బెంగళూరు సెంట్రల్ నుంచి గెలుపొందుతూ వచ్చిన పీసీ మోహన్‌కు చుక్కెదురయింది. రాష్ట్రం నుంచి నిర్మలా సీతారామన్ కాకుండా నలుగురు మంత్రులు ఉన్నారు. ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజె మరోసారి మంత్రులయ్యారు. మిగిలినవారిలో రాజీవ్ చంద్రశేఖర్ కేరళ రాష్ట్రం తిరువనంతపురం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. బీదర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన భగవంత్ ఖూబా దూరమయ్యారు. ఇద్దరు పదవులు కోల్పోగా కేవలం సోమణ్ణ రూపంలో ఒకరికే అవకాశం దక్కింది.



రమేశ్ జిగజిణగి



గద్దిగౌడర్



సోమణ్ణ



కుమారస్వామికి భారీ పరిశ్రమలు

బెంగళూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కేబినెట్‌లో రాష్ట్రం నుంచి ఐదుగురు మంత్రులు కాగా సోమవారం శాఖల కేటాయింపు జరిగింది. బీజేపీ మిత్రపక్షం జేడీఎస్‌కు చెందిన సీనియర్‌నేత కుమారస్వామికి కేంద్రంలో కీలకమైన భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ దక్కింది. నిర్మలా సీతారామన్‌కు మరోసారి కీలకమైన ఆర్థికశాఖతోపాటు కార్పొరేట్ అఫైర్స్‌శాఖలు వరించాయి. ప్రహ్లాద్‌జోషికి కేంద్ర పౌర ఆహార సరఫరాలశాఖ, సంప్రదాయేతర ఇంధన వనరులశాఖ దక్కింది. సహాయ మంత్రులుగా ఉన్న శోభాకరంద్లాజెకు మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ)తోపాటు కార్మిక, ఉపాధిశాఖలు దక్కాయి. తొలిసారి కేబినెట్‌లో చేరిన వి. సోమణ్ణకు జలశక్తి, రైల్వేశాఖ సహాయ మంత్రి పదవి వరించింది.



శివానంద స్వామిజీ (ఫైల్)

అన్నదానేశ్వర మఠాధిపతి

దారుణహత్య

- సహాయకుడి పనే
- పోలీసుల అదుపులో నిందితుడు



నిందితుడు రవి

బెంగళూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరం సిద్దార్థనగర బన్నూరు రోడ్డులోని అన్నదానేశ్వర మఠాధిపతి శివానందస్వామిజీ (90)ను సోమవారం మారణాయుధాలతో దాడి చేసి దారుణంగా హతమార్చారు. ఆస్తుల గొడవ నేపథ్యంలోనే హత్య జరిగినట్టు నజర్‌బాద్ పోలీసులు భావిస్తున్నారు. నిందితుడిగా అనుమానిస్తున్న రవి(60)ని అదుపులోకి తీసుకున్నారు. స్వామిజీ వద్ద రవి సహాయకుడిగా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసగా మారిన రవిని ఇటీవల స్వామిజీ మందలించినట్టు సమాచారం. ఆరోగ్యం పాడు చేసుకోవద్దని, నిరంతరం మద్యం సేవించడం మంచిది కాదని సూచించినట్టు తెలుస్తోంది. దీంతో ఆగ్రహానికి లోనైన రవి ఏకంగా కొడవలితో స్వామిజీపై దాడి చేశాడని తెలుస్తోంది. అనంతరం మద్యం తాగి అక్కడే కూర్చున్నాడని స్వామిజీ అన్న కొడుకు లోకేశ్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. నిందితుడు రవిని రెండున్నరేళ్ల కిందట స్వామిజీకి సేవలు చేసేందుకు నియమించారు. టి.నరసీపుర తాలూకా హుక్కల్‌గేరి గ్రామానికి చెందిన రవి నమ్మకస్తుడిగా ఉన్నాడు. ఆదివారం రవి భార్య కుటుంబ ఖర్చులకోసం డబ్బులు అడిగేందుకు రాగా చితకబాదాడు. స్వామిజీ మందలించి బుద్ధి మాటలు చెప్పారు. సోమవారం ఉదయం 9.30 గంటలైనా స్వామిజీకి టిఫిన్ తీసుకెళ్లేందుకు రవి రాకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు మఠానికి చేరుకున్నారు. స్వామిజీ హత్యకు గురైనట్టు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్వామిజీ మఠం ప్రాంగణంలోనే సిద్ధం చేసుకున్న సమాధి వద్దనే అంత్యక్రియలు జరుపుతామని లోకేశ్ మీడియాకు తెలిపారు. స్వామిజీ హత్యపై సమగ్ర దర్యాప్తు జరపాలని మఠానికి సంబంధించిన ఆస్తులు నగరంలోని కీలకప్రాంతాల్లో ఉన్నాయని లోకేశ్ డిమాండ్ చేశారు. మఠంకు అనుబంధంగా ఉండే చెరువు సంరక్షణకోసం స్వామిజీ పోరాటం చేస్తున్నారు. తొలుత శివానందస్వామిజీ సంస్కృత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా రిటైరయ్యారు. ఆ తర్వాత సిద్ధార్థనగర్‌లో అన్నదానేశ్వర మఠాన్ని స్థాపించి పేద విద్యార్థులకు సాయం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న నజర్‌బాద్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఓటమిపై సీఎం సమీక్ష

బెంగళూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర పరిధిలోని 3 లోక్‌సభ స్థానాల్లో ఓటమిపై సీఎం సిద్దరామయ్య సోమవారం సమీక్ష జరిపారు. సీఎంతోపాటు డీసీఎం డీకే శివకుమార్ పాల్గొన్నారు. బెంగళూరు నగర పరిధిలోని మూడు స్థానాల్లో ఓటమికి సంబంధించి నియోజకవర్గాల వారీగా ఓట్లశాతంపై ఆరా తీశారు. మంత్రులు రామలింగారెడ్డి, జార్జ్, జమీర్ అహ్మద్, హారిస్, యూబీ వెంకటేశ్, రిజ్వాన్ అర్షద్, కృష్ణప్ప, సుధామదాస్, నాగరాజ్‌యాదవ్, రాజ్యసభ సభ్యుడు చంద్రశేఖర్, రాజీవ్‌గౌడతోపాటు సీఎం రాజకీయ సలహాదారులు గోవిందరాజు, నాసిర్ అహ్మద్ పాల్గొన్నారు. నగరపరిధికి సంబంధించిన సమస్యలను చర్చించారు.



మంత్రులతో సీఎం సమీక్ష

బెంగళూరులో చెత్తపన్ను..?

- ఇంటికి రూ.100 వసూలుకు ప్రతిపాదన
- సర్కారు ఆదేశాల కోసం బీబీఎంపీ ఎదురుచూపు

బెంగళూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): చెత్తసేకరణకు ప్రతి ఇంటికి నెలకు వంద రూపాయల చొప్పున వసూలు చేసేందుకు బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) సిద్ధమైంది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఆదేశాలు జారీ అయితే ఆ వెంటనే నగర వ్యాప్తంగా చెత్త సేకరణకు నెలకు రూ.100 చొప్పున వసూలు చేస్తారు. సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ కంపెనీలు దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో చెత్త సేకరణ విధానం, అందుకు వసూలు చేసే రుసుంకు సంబంధించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాయి. వాటన్నింటికంటే తక్కువ వసూలు చేసేలా ప్రతిపాదనలుగా నెలకు రూ.100 చొప్పున నివేదిక సమర్పించారు. ఇలా నగర ప్రజలపై మరో పన్ను విధించేందుకు కసరత్తు సాగుతోంది. గతవారం బెంగళూరు సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ కంపెనీ నివేదిక పంపింది. సదరు కంపెనీ ద్వారానే సేవాపన్ను రూపంలో రూ.100 విధించదలిచారు. గడిచిన నాలుగైదేళ్లుగా సర్వీస్‌ట్యాక్స్ విధించే విషయమై చర్చ జరుగుతోంది. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఈ అంశాన్ని పక్కనపెట్టారు. తాజాగా మరోసారి చెత్త సేకరణకు పన్ను వసూలు చేసేందుకు కసరత్తు సాగిస్తున్నారు. విద్యుత్ బిల్లు ద్వారా చెత్త సేకరణ పన్ను విధించే అంశంపై కూడా చర్చ జరిగింది. గృహజ్యోతి గ్యారెంటీ అమలులో ఉండడంతో ఎక్కువమంది విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదు. మరో ఆలోచనగా ఆస్తిపన్ను ద్వారా చెత్త సేకరణ పన్ను అనుసంధానం చేసే ప్రతిపాదన కూడా ఉంది. ఆస్తిపన్నులు నెలవారీ చెల్లించరని, ఏడాదికోసారి మాత్రమే అమలులో ఉండడంతో ఈ ప్రతిపాదన కూడా పక్కనపెట్టారు. ప్రస్తుతం నెలవారీ వాటర్ బిల్లులు వసూలు చేస్తారు. అదే తరహాలోనే చెత్తబిల్లు వసూలు చేయాలనే ప్రతిపాదన ఉంది. ఇళ్లకు రూ.100, వాణిజ్యభవనాలకు రూ.200 చొప్పున ప్రతిపాదనలు ఉన్నాయి. ఒకే భవనంలో 10 ఇళ్లు ఉంటే ప్రతి ఇంటికి వంద రూపాయలచొప్పున వసూలు చేయాలని భావిస్తున్నారు. నగర వ్యాప్తంగా నివాసాలు, వాణిజ్య కట్టడాలు, అపార్ట్‌మెంట్లు ఎంతమేర ఉన్నాయనేది ఇప్పటికే సర్వే చేశారు. చార్జీలు నిర్ణయిస్తే ఏడాదికి కనీసంగా రూ.800 కోట్ల మేర ఆదాయం వస్తుందని భావించారు. చెత్తసేకరణ అంశం 2016లోనే నిబంధన ప్రకారం నోటిఫికేషన్ అయ్యింది. అప్పట్లోనే రూ.100 వసూలు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం అంగీకరిస్తే వెంటనే చెత్తపన్ను విధించే ప్రక్రియ ప్రారంభం కానుంది. పొరుగున ఉండే ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల చెత్తపన్ను విధించడంపై ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చింది. తాజాగా ఏపీలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం చెత్తపన్నును రద్దు చేయాలని భావిస్తోంది. కానీ ఎన్నో విధాలా ఆదాయం కల్గిన బెంగళూరులో చెత్తపన్ను వసూలుపై ప్రజలు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి. మరోవైపు ఏడాది ఆఖరులోగానే బీబీఎంపీ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్న తరుణంలో చెడ్డపేరు వస్తుందని అధికార కాంగ్రెస్ అగ్రనేతలు ఆలోచిస్తున్నట్టు సమాచారం. మరో నాలుగైదు రోజుల్లోనే చెత్త పన్నుపై ఒక స్పష్టత రానున్నట్టు తెలుస్తోంది.



తుంగభద్రకు పెరుగుతున్న వరద

బళ్లారి గాంధీనగర్, జూన్ 10: కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల జీవనాడిగా నిలిచిన తుంగభద్ర ఇపుడిపుడే జల కళ సంతరించుకుంటోంది. రుతుపవనాల కారణంగా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జలాశయం ఎగువ ప్రాంతాలైన అగుంబె, వర్నాడు, ఖుదరేముఖ తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో తుంగ, భద్ర నదులకు అధిక స్థాయిలో వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ రెండు నదుల కలయికతో ఏర్పడిన తుంగభద్రలో వరద ప్రవాహం రోజు రోజుకు పెరుగుతుండంతో తుంగభద్ర జలాశయానికి జలకళ సంతరించుకోవడంతో అయకట్టు రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. గత ఏడాదితో పోల్చుకుంటే ఈసారి జలాశయానికి ముందుగానే వరద నీరు వచ్చి చేరుతోంది. ఈసారైన పంటలసాగుకు అవసరమైన సాగునీరు లభిస్తుందని ఆయకట్టు రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం జలాశయం నీటి మట్టం 1580.23 అడుగులకు చేరుకుంది. 4,817 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతోందని, ప్రస్తుతం జలాశయంలో 4.58 టీఎంసీల వరద నీరు నిలువ ఉన్నట్లు జలాశయం అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో జలాశయానికి కేవలం 280 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరిందని బోర్డు అధికారులు తెలిపారు.



జలాశయంలో పెరుగుతున్న నీరు


నోటాకు జై కొట్టారు..!

- 9 స్థానాల్లో మూడోస్థానం
- కాంగ్రెస్, బీజేపీపై ఓటర్ల అసంతృప్తి



బెంగళూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడేందుకు ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికలు కీలకం. 18 ఏళ్లు నిండినవారంతా ఓటు హక్కు పొందవచ్చు. ఎన్నికల్లో పార్టీ లేదా అభ్యర్థి ఇష్టం లేకుంటే నన్ ఆఫ్ ది అబోవ్ (నోటా)కు ఓటు వేసే సౌలభ్యం ఉంది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 9 నియోజకవర్గాల్లో నోటా ఓట్లు మూడోస్థానంలో నిలవడం సర్వత్రా విస్మయం కలిగిస్తోంది. రాష్ట్రంలో 28 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా రెండు విడతల్లో పోలింగ్ జరిగింది. ఏప్రిల్ 26, మే 7వ తేదీలలో ఎన్నికలు నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బీజేపీ 25 స్థానాల్లో పోటీ చేసి జేడీఎస్‌కు 3 స్థానాలు కేటాయించింది. వీటిలో కోలారు, హాసన్, మండ్య ఉన్నాయి. ప్రతి నియోజకవర్గంలోనూ స్వతంత్రులు, ప్రాంతీయ పార్టీల అభ్యర్థులు పోటీ చేశారు. ప్రతిచోటా పదుల సంఖ్యలోనే బరిలోకి నిలిచారు. ఎన్నికలు మాత్రం కాంగ్రెస్, బీజేపీ - జేడీఎస్ కూటమి అభ్యర్థుల మధ్యే జరిగాయి. రెండు పార్టీలు పోటాపోటీగా ఓట్లు సాధించాయి. ప్రతి అభ్యర్థి 2-4 లక్షలకు పైగానే ఓట్లు పొందారు. ఆ తర్వాతిస్థానంలో స్వతంత్రులు 10వేలకు అటు ఇటుగా మాత్రమే సాధించగలిగారు. 28 స్థానాల్లో ఏకంగా 9 చోట్ల మూడో స్థానంలో నోటాకు ఓట్లు పడ్డాయి. అత్యధికంగా దక్షిణకన్నడలో 23,576 ఓట్లు పడగా బెంగళూరు ఉత్తరలో 13,554 ఓట్లు పడ్డాయి. నోటాకు ఇంతస్థాయిలో ఓట్లు రావడం రాజకీయ పార్టీల ప్రముఖులు ఆలోచనలో పడ్డారు. పొరపాటున నోటాకు వేశారా..? లేదా పనిగట్టుకుని అభ్యర్థులపై వ్యతిరేకత చూపేందుకు ఇలాంటి ప్రయోగం చేశారా... అనేది ఆలోచించే పరిస్థితి కలిగిస్తోంది. పోలింగ్ కేంద్రం దాకా వెళ్లి అభ్యర్థులకు కాకుండా నోటాకు వేలాది మంది ఓటు వేశారా..? అనేది కీలకమవుతోంది. దక్షిణకన్నడలో 23,576 ఓట్లు నోటాకు పోల్ కాగా 1.7శాతంగా నమోదైంది. బెంగళూరు సెంట్రల్‌లో 12,126 ఓట్లతో 0.9శాతం, ఉడుపి-చిక్కమగళూరులో 11,269 ఓట్లతో 0.9శాతం, హావేరిలో 10,865 ఓట్లతో 0.8శాతం, రాయచూరులో 9,850 ఓట్లతో 0.8శాతం, బెంగళూరు నార్త్‌లో 13,554 ఓట్లతో 0.8శాతం, బళ్లారిలో 7,889 ఓట్లతో 0.6శాతం, బెంగళూరు దక్షిణలో 7,857 ఓట్లతో 0.6శాతం, బెంగళూరు గ్రామీణలో 10,649 ఓట్లతో 0.5శాతం నమోదైంది. ఈ నియోజకవర్గాల్లో నోటాకు మూడోస్థానం దక్కింది. ఇక మిగిలిన ఉత్తర కన్నడ, బెళగావి, విజయపుర, చిక్కబళ్లాపుర, ధారవాడ, కలబురగి, కోలారు, మండ్య, మైసూరు, శివమొగ్గ, తుమకూరు లోక్‌సభ స్థానాల్లో నోటాకు నాల్గో స్థానంలో ఓట్లు పడ్డాయి. బాగల్కోటె, చిత్రదుర్గ స్థానాల్లో నోటాకు 5శాతంతో ఓట్లు పడ్డాయి.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,580.23	1,581.07
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	4817	280
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10	246
సామర్థ్యం (టీఎంసీలు)	4.58	5.01

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఆసనాలు వేస్తున్న యోగాశిక్షకులు

బళ్లారి సిటీ, జూన్ 10: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని గురువులు సూచించారు. సోమవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా నగరంలోని స్టేషన్ రోడ్డులో సీనియర్ యోగా గురువు కంప్లియ నాగప్ప యోగా శిక్షణ ప్రారంభించారు. పతంజలి యోగా కమిటీ ఫ్రీడమ్ పార్క్ యోగా కేంద్రం సహకారంతో శనివారం వరకు జరిగే ఈ శిక్షణలో నాగప్ప ఏడు రకాల వ్యాయామాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలో 72వేల నరాలు ఉన్నాయి. వీటిలో కాళ్లలో 40వేలు, చేతుల్లో 20వేలు, చెవుల్లో 12వేల నరాలు ఉంటాయన్నారు. మొత్తం శరీరాన్ని నియంత్రించడంలో నరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. యోగాసనాలతో నరాలను పటిష్ఠంగా తయారు చేయవచ్చ న్నారు. అమెరికన్ యూనివర్సిటీ ఆఫ్ యోగా నుంచి మెడికల్ గైడెన్స్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన నాగప్ప శనివారం వరకు ఈ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నారు. సీనియర్ యోగా అభ్యాసకులు ప్రకాశ్ కులకర్ణి, రాజేశ్, కోఆర్డినేటర్ శ్రీరామ్, వెంకటేశ్, రామచంద్ర, అనంతజోషి తోపాటు పలువురు యోగా విన్యాసకులు పాల్గొన్నారు.

కూతురు సహా తల్లి ఆత్మహత్య

రాయచూరు, జూన్ 10 : తన కూతురుతో సహా తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జిల్లాలోని లింగసుగూరు తాలూకా గుడదనాళ గ్రామానికి చెందిన లక్ష్మి(46) తన కూతురు అంబిక(13)తో కలిసి సోమవారం తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొన్నేళ్లుగా భర్తకు దూరంగా ఉంటున్న ఈ మహిళ మానసిక స్థితి సరిగ్గా లేకపోవడమే ఆత్మహత్యకు కారణమై ఉంటుందని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి కుమారుడు పంపనగౌడ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లింగసుగూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: సీఐ



మాట్లాడుతున్న సీఐ ప్రకాష్ మాళి

కంప్లి, జూన్ 10: పట్టణంలో ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని సీఐ ప్రకాష్ మాళి సూచించారు. సోమవారం కంప్లి పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకు గ్రామాల నుంచి ఎన్నో పనులపైన ప్రజలు, రైతన్నలు, స్కూలు విద్యార్థులతో రద్దీపెరుగుతుంది. దానినిదృష్టిలో వుంచుకుని డ్రైవర్లు తమకు కేటాయించిన ప్రదేశాల్లో వాహనాలు నిలుపుకుని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. దాంతో పాటు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు దగ్గరే వుంచుకోవాలని తెలిపారు.

గోడౌన్‌కు చేరిన పాఠ్యపుస్తకాలు

సిరుగుప్ప, జూన్ 10 : పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులకు పంచాల్సిన పుస్తకాలు గోడౌన్‌కు చేరాయి. సోమవారం తాలూకా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాల పంపిణీ కోసం పుస్తకాలను కార్మికులు గోడౌన్‌లకు చేర్చారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి పుస్తకాలను అందజేస్తామని విద్యా శాఖ అధికారులు వెల్లడించారు.

కుమారకు మంత్రి పదవిపై జేడీఎస్ సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న జేడీఎస్ కార్యకర్తలు

బళ్లారి సిటీ, జూన్ 10: జేడీఎస్ నాయకుడు, మాజీ సీఎం కుమారస్వామికి మంత్రి పదవి దక్కడంపై పార్టీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. సోమవారం నగరంలోని రాయల్ సర్కిల్ సమీపంలో జేడీఎస్ జిల్లా కమిటీ కార్యకర్తలు మిఠాయిలు పంచి టపాసులు కాల్చి ఆనందాన్ని పంచుకున్నారు. జేడీఎస్ జిల్లాధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా తాయణ్ణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్‌లో స్థానం దక్కడం హర్షణీయమన్నారు. కుమార స్వామి తన రాజకీయ జీవితంలో దేశానికి అన్నం పెట్టే రైతులు పేదలు, మహిళలు, వెనుకబడిన తరగుతుల ప్రజల పక్షాన పోరాడి వారి అభివృద్ధికి కృషి చేశారన్నారు. రాష్ట్రంలో జేడీఎస్‌కు మళ్లీ పూర్వ వైభవం ఖాయమన్నారు. సండూరు నియోకవర్గానికి చెందిన కురేకుప్ప సోమప్ప మాట్లాడుతూ మాజీ సీఎం బీజేపీ పొత్తుతో జేడీఎస్‌కు మళ్లీ రాష్ట్రంలో అధికారం దక్కడం ఖాయమన్నారు. ఈకార్యక్రమంలో లక్ష్మీకాంతరెడ్డి మదురె విజయకుమార్, యల్లనగౌడ, వన్నూర్‌స్వామి, అద్దగేరిరామన్న, అశోక్, రామాంజనేయులు, చాగనూర్ నాగరాజ్, కమ్మరచేడ్ వీరేశ్, కిరణ్. రాకేశ్, భవాని, జమీలా, రేణుక. షబానా తదితరులు పాల్గొన్నారు.

తోరణగల్లు : సండూరు తాలుకా కురేకుప్ప పట్టణంలో ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ జేడీఎస్ నాయకులు మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి, కేబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా భారతీయ జనతాపార్టీ నాయకులు, కార్యకర్తలు, జీడీఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పుర సభ సభ్యులు సోమప్ప, బీజేపీ ప్రముఖులు నారాయణ రెడ్డి, ప్రముఖులు శివ రంగప్ప, ఓబురెడ్డి, మారుతీ శంకర్, జీడీఎస్ పార్టీ, బీజేపీ పార్టీ పుర సభ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తోరణగల్లులో బీజేపీ నాయకుల సంబరాలు



విలేకరులతో మాట్లాడుతున్న వసంత్ కుమార్

కాంగ్రెస్‌కే పట్టం కట్టిన కల్యాణ-కర్ణాటక

●కేపీసీసీ కార్యాధ్యక్షుడు, ఎమ్మెల్సీ వసంత్ కుమార్

రాయచూరు, జూన్ 10 : రాష్ట్రంలోని కళ్యాణ-కర్ణాటక ప్రాంతంలో మొత్తం స్థానాలని కాంగ్రెస్ పార్టీకి కట్టబెట్టడం ద్వారా ప్రజలు కాంగ్రెస్ పార్టీ పట్ల ఉన్న నమ్మకాన్ని మరో సారి రుజు చేశారని కేపీసీసీ కార్యదృక్షుడు, ఎమ్మెల్సీ ఎ.వసంత్ కుమార్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి లభించిన ఆదరణ చూస్తుంటే పార్టీ పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందనడానికి ఫలితాలు నిదర్శనమన్నారు. సోమవారం నగరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్వేష రాజకీయాలు, మతం, దేవుడు అంటు ఎంతో అబద్ధపు ప్రచరాలు చేసినా బీజేపీ పట్ల ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతకు లోకసభ ఎన్నికలు సాక్షిగా నిలిచాయన్నారు. ఖర్గే నాయకత్వంలో పార్టీకి పూర్వ వైభవం ఖాయమన్నారు. కల్యాణ కర్ణాటక ప్రాంత ప్రజలకు అభినందనలన్నారు. కాగా ఇతర పార్టీల బలంతో నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏర్పడిన ఎన్‌డీఏ ప్రభుత్వం మనుగడ ప్రశ్నార్థకమేనని వసంత్‌కుమార్ వ్యాఖ్యానించారు.

మాదిగ సమాజానికి మంత్రి పదవులివ్వాలి

బళ్లారి సిటీ, జూన్ 10: రాష్ట్రంలోని మాదిగ సామాజిక వర్గానికి చెందిన రమేశ్ జిగజిణగి, గోవింద కారజోళకు మంత్రి పదవి ఇవ్వాలని మాదిగ మహాసభ విజయగనం జిల్లా కేంద్రం కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. సోమవారం హొసపేట ప్రెస్ క్లబ్‌లో మాదిగ మహాసభ విజయనగరం జిల్లా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదిగ మహాసభ విజయనగరం జిల్లా శాఖ బాధ్యులు వీరస్వామి, రామచంద్ర మాట్లాడుతూ... కేంద్ర మంత్రి వర్గంలో వామపక్ష సామాజికవర్గానికి చెందిన గోవింద కారజోళ, రమేశ్ జిగజిణగి వదిలి వేయడం సమంజసం కాదన్నారు. వారికి మంత్రి పదవులిస్తేనే ఆయా సామాజిక వర్గాలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎంసీ వీరస్వామి, రామచంద్ర, భరత్‌కుమార్, జగన్, సన్నమారెప్ప, గాదిలింగప్ప , రఘు, శ్రీనివాస్, శేషు, కరియప్ప ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు



డీసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఏబీవీపీ ఆందోళన

రాయచూరు, జూన్ 10 : బీఈడీ కళాశాలల్లో యాజమాన్య కోటా విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాన్ని రద్దు చేయడంపై ఏబీవీపీ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. హాస్టల్ సౌకర్యం రద్దుతో అనేక మంది విద్యార్థులు బీఈడీ చదువుకు దూరమయ్యే పరిస్థితి తలెత్తుతుందని, తక్షణమే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలన్నారు. దీంతో పాటు పలు సౌకర్యాల పై రాష్ట్ర ప్రభుత్వం కోత విధించడాన్ని విద్యార్థులు తప్పుబట్టారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని గతంలో ఉన్న విధి విధానాలనే కొనసాగించాలని కోరుతూ జిల్లాధికారికి వినతి పత్రం అందజేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న రఘువీర్ నాయక్

అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

● వాల్మీకి నాయకుడు రఘువీర్ నాయక్

రాయచూరు, జూన్ 10 : కర్ణాటక వాల్మీకి కార్పోరేషన్ నిధుల దుర్వినియోగం ఆరోపణల పై సీబీఐ చేత విచారణ జరిపించాలని కల్యాణ-కర్ణాటక వాల్మీకి సంఘం కార్యదర్శి రఘువీర్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్ క్లబ్‌లో ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ టీం ద్వార నిధుల దుర్వినియోగం పై విచారణ జరపడాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రభుత్వమే అవినీతిలో భాగస్వామిగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం నియమించిన కమిటీకి ప్రాధాన్యత ఉండదన్నారు. సీబీఐకి ఇవ్వడం సముచితమని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా వాల్మీకి అభివృద్ధి మండలి ద్వార వ్యక్తిగత రుణాలు, సంఘాలకు ఇచ్చే రుణాలు, నేరుగా ఇచ్చేవి, దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలకు సంబంధించి ప్రతి ఏటా రూ.6 నుంచి రూ.7 వందల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తుండగా కరోనా సమయం నుంచి వాటన్నింటిని నిలిపివేసినట్లు ఆయన ఆరోపించారు.

జేఎన్ గణేష్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

కంప్లి, జూన్ 10 : నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎన్నికైన జేఎన్ గణేష్‌కు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్ చాంద్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం కంప్లి పట్టణంలో సీకే టవర్ ఆవరణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ హయాంలోనే కంప్లి క్షేత్రానికి ఎన్నో పథకాలు తీసుకువచ్చి పూర్తి అభివృద్ధి బాటలో కొనసాగించారు. అలాంటి నాయకుడికి కాంగ్రెస్ పార్టీ పెద్దలు అవకాశం కల్పిస్తే మరింత క్షేత్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మెట్రి గ్రామ పంచాయతీ సభ్యులు కుమారస్వామి, గిరీష్, జగదీష్, హనుమంతప్ప, చేతన్ కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి నివారణ: సీఐ

సిరుగుప్ప, జూన్ 10 : క్రీడలతో మానసిక ఒత్తిడి నివారించవచ్చని టెక్కలకోట సీఐ సుందరేష్ తెలిపారు. సోమవారం సిరుగుప్ప పట్టణం హైస్కూలు గ్రౌండ్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసుల క్రీడలను క్రికెట్ బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీసు వృత్తి ఎప్పుడూ ఒత్తిళ్లతో ఉంటుందన్నారు. ఆ ఒత్తిళ్లను నివారించుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలతో ఉల్లాసం, ఉత్సాహం కలుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిమ్మన్న నాయక్, ఇరువర్గాల పోలీసు క్రీడాకారులు అధికారులు పాల్గొన్నారు.

జూలై 10న విక్రవాండి ఉప ఎన్నిక

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి నియోజకవర్గం ఉప ఎన్నిక జూలై 10వ తేదీ జరుగనుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటన విడుదల చేసింది. విక్రవాండి ఎమ్మెల్యే, విల్లుపురం మధ్య జిల్లా డీఎంకే కార్యదర్శి పుహళేంది ఏప్రిల్ 5వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారసభలో పాల్గొని హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయిన విషయం తెలిసిందే. ఆయన్ని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ 6వ తేది మృతిచెందారు. ఎమ్మెల్యే పుహళేంది మృతి విషయాన్ని శాసనసభ కార్యదర్శి ఎన్నికల సంఘానికి 8వ తేది సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో, పార్లమెంటు ఎన్నికలు ఏడు విడతలుగా ఈ నెల 1వ తేది వరకు జరిగిన విషయం తెలిసిందే. ఏడో విడత పార్లమెంటు ఎన్నికలతో పాటు విక్రవాండి ఉప ఎన్నిక కూడా జరుగుతుందని భావించినా, నిర్వహణ కారణాల రీత్యా ఎన్నికల సంఘం ఉప ఎన్నిక తేదీ ప్రకటించలేదు.

ప్రాచీన కాలానికి నిలువుటద్దం మ్యూజియం: డీసీ

బళ్లారి సిటీ, జూన్ 10: చరిత్ర, మ్యూజియంలతో విడదీయరాని అనుబంధం ఉందని, అవి ప్రాచీన చరిత్రకు అద్దం పడతాయని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. నగరంలోని రాబర్ట్ బ్రూస్ ఫుట్ సంగనకల్లు మ్యూజియం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబర్ట్ బ్రూస్ ఫుట్ సంగనకల్లు మ్యూజియంలో అనేక పురాతన శిలాజాలు సేకరించి ఆకర్షణీయమైన మ్యూజియంలో ఉంచారన్నారు. మనందరం సైన్స్‌లో గతాన్ని గుర్తుంచుకోవాలి సాంకేతిక మారుతున్నప్పటికీ ప్రాచీన సంస్కృతి యొక్క జ్ఞానం మారదు, దీని నుంచి యువ పరిశోధకులు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్భవించాలని ఆశించారు. మ్యూజియంల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక అవసరమన్నారు. రాబర్ట్ బ్రూస్ ఫుట్ మ్యూజియం గౌరవ సంచాలకులు రవి కోరి షెట్టర్ మాట్లాడుతూ చరిత్ర పాదముద్రలను ఉంచడం మ్యూజియంల పని అని, ఇందులో వైద్యరంగం తనదైన వాటాను కలిగి ఉందన్నారు. వాస్తవానికి రాబర్ట్ ఫుట్ సంగనకల్లు పురాతన శిలాయుగం, లియోలిథిక్ పురావస్తు మ్యూజియంలో రాతి యుగం సాదనాలపై ప్రత్యేకమైన చరిత్ర పూర్వ సమాచారం ఉంది. రాబర్ట్ బ్రూస్ ఫుట్ రాతియగంపై దృష్టి సారించే ఏకైక మ్యూజియం సంగనకల్లు పురావస్తు మ్యూజియం. కార్యక్రమం ముందుగా ప్రముఖులంతా ప్రొఫెసర్ సత్యరాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా, కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకుడు బి.నాగరాజు, రాబర్ట్ బ్రూస్ ఫుట్‌సంగనకల్లు పురావస్తు మ్యూజియం సభ్యుడు సంతోష్‌మార్టిన్, టెక్నికల్ అసిస్టెంట్ గౌరీ, టీజీ విఠల్ పాల్గొన్నారు.



ప్రొఫెసర్ సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీసీ. తదితరులు

రహదారులను పరిశీలించిన ఎమ్మెల్యే

బళ్లారిరూరల్, జూన్ 10 : నగరంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులు జలమయమయ్యాయి. సోమవారం సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, ఆయన సోదరుడు శరత్ రెడ్డి లోతట్టు ప్రాంతాలతో పాటు పలు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఆయా ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచి ఉందా, వర్షం వల్ల ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కార్పొరేషన్, క్లాక్ టవర్, తదితర ప్రాంతాల్లో వర్షంలోనే ఆయన కలియదిరిగారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు కార్పొరేటర్ మించు శ్రీనివాస్, కమిషనర్ ఖలీల్‌సాబ్, పలు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నగరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

హోసూరు జోన్



సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ కార్యకర్తలు

బీజేపీ కార్యకర్తల సంబరాలు

హోసూరు, జూన్ 10: నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కృష్ణగిరి పశ్చిమ జిల్లా హోసూరు తూర్పు మున్సిపల్ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు జరిపారు. గాంధీ విగ్రహం దగ్గర బాణాసంచాల కాల్చి మిఠాయిలు పంచుతూ సందడి చేశారు. కార్యక్రమానికి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ అధ్యక్షత వహించి ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. వేడుకల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి విజయకుమార్, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యాక్షులు మురుగన్, జిల్లా కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, వరలక్ష్మి, మున్సిపల్ అధ్యక్షులు మణికంఠన్, రమేశ్, కన్నన్, తంగరాజ్, నాగేంద్ర పాల్గొన్నారు.

భూమిపూజ

హోసూరు, జూన్ 10: పట్టణంలో సుమారు రూ.53 లక్షలతో సీడ్ ప్రాసెసింగ్ మిషన్ షెడ్లు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎస్.ఏ.టీ.బీ 2023-2024 ప్రాజెక్టు క్రింద హోసూరు రాయకోట రహదారిల్లోని సబ్ ట్రెజరీ సమీపంలోని 100 మీటర్ల సామర్థ్యం గల సీడ్ ప్రాసెసింగ్ మిషన్ షెడ్, 1 ఎమ్‌టీ సామర్థ్యం గల సీడ్ ప్రాసెసింగ్ మిషన్ షెడ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వై ప్రకాశ్ భూమి పూజ చేశారు. మేయర్ సత్య, పార్టీ జిల్లా కార్యదర్శులు రాము, వెంకటేశ్, జిల్లా సాహితీ బృందం ఆర్గనైజర్ శక్తివేల్, జిల్లా మైనార్టీ విభాగం ఆర్గనైజర్ ఈ క్రమం అహమద్, వార్డు కార్యదర్శులు నాగరాజ్, శివ, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



భూమిపూజలో ఎమ్మెల్యే వై. ప్రకాశ్ తదితరులు

పాఠశాలల ప్రారంభం.. తొలిరోజే పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ సరయు



విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

హోసూరు, జూన్ 10: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన తొలిరోజే సోమవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఒకటో తరగతి నుంచి కళాశాల వరకు చదువుతున్న విద్యార్థుల కోసం తమిళనాడు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. ఇలా 1 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేసే కార్యక్రమం చేపట్టారు. తొలిరోజు ఏర్పాటైన కార్యక్రమంలో కలెక్టర్ సరయు స్వయంగా పాల్గొని కొంతమంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది ఉత్తీర్ణతలో 22 వ స్థానం సాధించ డం గర్వించదగ్గ విషయమన్నారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైనవారు 11వ తరగతిలో కోరుకున్న సబ్జెక్టులకు ఎంచుకుని ఉన్నత చదువులతో రాణించాలన్నారు. సిలబస్ బాగా చదివి పాఠశాలల్లో నిర్వహించే నెలవారీ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. టీవీ, స్మార్ట్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపాల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కేపీ మహేశ్వరీ, జిల్లా ప్రిన్సిపాల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంక టేశం ఇంటర్వ్యూ అసిస్టెంట్, అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ వడివేలు, స్కూల్ ప్రిన్సిపాల్ రమేశ్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఘన స్వాగతం

వేసవి సెలవుల అనంతరం తమిళనాడు వ్యాప్తంగా పాఠశాలలు సోమవారం తెరుచుకున్నాయి. కృష్ణగిరి జిల్లా హోసూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వీట్లు అందజేసి పూలమాలలు వేసి స్వాగతించారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని తేరుపేట లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో మొత్తం 480 మంది విద్యార్థులు చేరారు. ఒకటో తరగతిలో చేరిన 90 మంది విద్యార్థులకు ప్రోత్సాహించేందుకు ప్రధానోపాధ్యాయుడు పొండర్, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు.

కలాన్ సేవలు చిరస్మరణీయం

హోసూరు, జూన్ 10: ఐఎన్‌టియూసీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించిన కలాన్ సేవలు చిరస్మరణీయమని వక్తలు అభిప్రాయపడ్డారు. హోసూరు కామరాజర్ కాలనీలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో కలాన్ నాల్గో వర్ధంతి సభను సోమవారం నిర్వహించారు. ఐఎన్‌టియూసీ అఖిల భారత సీనియర్ ఉపాధ్యక్షుడిగా, మాజీ ఎమ్మెల్యేగా కొనసాగి కలాన్ తన తుదిశ్వాస వరకు కార్మికుల సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. కలాన్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే మనోహరన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం కార్యదర్శి మునిరాజ్, రాజేంద్రన్, భక్తవత్సలం, కోదండరామన్, పరందామన్, అరుళ్‌మూర్తి, చెన్నప్ప, సెందిల్, మునిరాజ్, మురుగేశ్, మరియప్ప, తదితరులు పాల్గొన్నారు.



కలాన్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు, అభిమానులు

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో బాలకృష్ణ అభిమానులు

కంప్లి, జూన్ 10 : నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదినం సందర్భంగా పట్టణంలో అభిమానులు కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అభిమాన సంఘం అధ్యక్షుడు కోనంకి బాలకృష్ణ మాట్లాడుతూ నటనలోను, సమాజ సేవలోను రాణిస్తున్న బాలకృష్ణ మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై రాజకీయంలోనూ తిరుగులేని నాయకుడిగా ఎదిగారన్నారు. మున్ముందు మరిన్ని హోదాలు పొంది ప్రజలకు మరిన్ని సేవలు చేయాలని అన్నారు. వారితో పాటు మాదినేని నాగరాజు, పెనకలపాటి జయప్రకాష్, నరసింహ, వెంకటస్వామి, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు బోర్లు మంజూరు

కంప్లి, జూన్ 10 : తాగునీటి ఎద్దడి నివారణకు ఆరు బోర్లు మంజూరు చేశారు. కుడితిని పట్టణంలో మాజీ పట్టణ పంచాయతీ అధ్యక్షులు వి రాజశేఖర్ వార్డుల్లో నీటి సమస్య తలెత్తడంతో ఏటీసీ అదానీ కంపెనీ వారితో చర్చలు జరిపి టీఎస్ఆర్ నిధుల కింద ఆరు బోర్లను మంజూరు చేయించారు. అందులో 1వ వార్డుకు ఒకటి, 4వ వార్డులో రెండు, బుడుగ జంగమ కాలనీలో ఒకటి, నేతాజీ స్కూలు వద్ద ఒకటి బోర్లు వేయించారు. మిగిలిన ఒకటి శ్మశానంలో వేయిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గతంలో 4, 3, 1వార్డుల్లో నీటి సమస్య తమ దృష్టికి రావడంతో తమ నాయకుడు తుకారామ్‌కు తెలియజేయడంతో స్పందించి టీఎస్ఆర్ నిధుల కింద నిధులు మంజూరు చేయించారన్నారు. వారితో పాటు అదా నీ కంపెనీ అధికారి షబ్బీర్, వెంకటరమణ బాబు, చంద్ర య్య దొడ్డ బసప్ప, గంగాధర, వార్డు నివాసులు కార్మికులు పాల్గొన్నారు.




బుడగజంగమ కాలనీలో బోరు వేస్తున్న దృశ్యం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంట్...

జీడీ బిర్లా (వర్ధంతి)



పద్మభూషణ్ గ్రహీత, భారత దేశ గొప్ప పారిశ్రామిక వేత్తలలో ఒకరైన జీడీ బిర్లాగా పిలిచే ఘన్‌శ్యామ్ దాస్ బిర్లా 1894 ఏప్రిల్ 10న రాజస్థాన్ రాష్ట్రం పిలాని గ్రామంలో జన్మించారు. తాత స్ఫూర్తితో బట్టల వ్యాపారంలో రాణించి పిలాని గ్రామంలో ఒక హావేటలి నిర్మించారు. 1918లో జ్యూట్‌మిల్స్‌ను విస్తరింపచేశారు. 1919లో గ్వాలియర్‌లో మరోమిల్లును ఏర్పాటు చేశారు. అనంతరం హిందూస్థాన్ మోటార్స్‌ను నెలకొల్పారు. యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్ (యూకో)కు శ్రీకారం చుట్టారు. బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్), టిట్స్‌లతోపాటు ఎన్నో విద్యాసంస్థలను అభివృద్ధి చేశారు. అంతేకాక మహాత్మాగాంధీ ఢిల్లీలో నెలకొల్పిన 'హరిజన సేవక్ సంఘ్'కు సంస్థాపక అధ్యక్షుడు. 1983 జూన్ 11న కన్నుమూశారు.

అబు అబ్రహాం (జయంతి)




'అబు' కలం పేరిట పేరొందిన అత్తుపురథు మాథ్యూ అబ్రహాం 1924 జూన్ 11న కేరళ రాష్ట్రం మవేలికరలో జన్మించారు. కార్టూనిస్ట్, జర్నలిస్టు, రచయితగానే కాక ఎంపీగాను రాణించారు. నాలుగు దశాబ్దాలపాటు ది బాంబే క్రానికల్, శంకర్స్ వీక్లీ, బ్లిట్జ్, ద గార్డియన్, ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తదితర జాతీయ, అంతర్జాతీయ పత్రికలలో ఆయన కథనాలు ప్రచురితమయ్యాయి. రాజకీయాలు, అవినీతిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాజ్యసభ సభ్యుడిగా కొంతకాలం వ్యవహరించారు. 2002 డిసెంబరు 1న కన్నుమూశారు.

డాక్టర్ కనక్ రెలె (జయంతి)



మోహినీయాట్టం నృత్యంలో రాణించిన 'పద్మభూషణ్' గ్రహీత కనక్ రెలె 1937 జూన్ 11న గుజరాత్‌లో జన్మించారు. ముంబైలోని నలందా డ్యాన్స్ రీసెర్చ్ సెంటర్, నలందా నృత్య కళా మహావిద్యాలయ సంస్థాపక డైరెక్టర్. ముంబై యూనివర్సిటీ నుంచి న్యాయవాద పట్టాతోపాటు డ్యాన్స్‌లో పీహెచ్‌డీ పొందారు. మోహినీ యాట్టం నృత్యంపై ప్రత్యేక పుస్తకాన్ని రచించారు. ఆమె పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ అవార్డు, గౌరవ్ పురస్కార్ తదితర అవార్డులు పొందారు. 2023 ఫిబ్రవరి 22న కన్నుమూశారు.

టీవీ గోపాలకృష్ణన్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత త్రిపుణితుర విశ్వనాథన్ గోపాలకృష్ణన్ (టీవీజీ) 1932 జూన్ 11న సంగీతకారుల కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి టీజీ విశ్వనాథ భాగవతార్ కొచ్చిన్ రాజసంస్థానంలో సంగీత కళాకారులు. కర్ణాటక, హిందూస్థానీ గాత్ర సంగీతం, మృదంగం, వయోలిన్‌లలో రాణించిన అతికొద్ది కళాకారులలో టీవీజీ ఒకరు. ఇండియన్ జాజ్ శైలిని అభివృద్ధిచేశారు. 'అకాడమీ ఆఫ్ ఇండియన్ మ్యూజిక్ అండ్ ఆర్ట్స్' స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి గురుకులం తరహాలో బోధనలు చేశారు. కళైమామణి, సంగీత కళానిధి, తదితర అవార్డులు పొందారు.

మానసిజోషి (పుట్టినరోజు)



మానసి గిరీశ్ చంద్ర జోషి 1989 జూన్ 11న గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌లో జన్మించారు. పారా బ్యాడ్మింటన్ ప్లేయర్. 2015లో ప్రొఫెషనల్ క్రీడా రంగంలో అడుగుపెట్టి ఉమెన్స్ సింగిల్స్ ఎస్ఎల్ 3 కేటగిరీలో వరల్డ్ నెంబరు 2గా నిలిచారు. తొలుత పారా బ్యాడ్మింటన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో మిక్స్‌డ్ డబుల్స్‌లో రజత పతకం సాధించారు. 2018, 2019లలో కాంస్య, బంగారుపతకం అందుకున్నారు. 2020 టైమ్ మ్యాగజైన్‌చే నెక్ట్స్ జనరేషన్ లీడర్ అవార్డు, బీబీసీ 100 ఉమెన్ జాబితాలో చోటు దక్కించుకున్నారు. మహారాష్ట్ర రాజ్య ఏకలవ్య ఖేల్ కృదా పురస్కారం, నేషనల్ అవార్డ్ ఫర్ బెస్ట్ స్పోర్ట్స్ పర్సన్ విత్ డిజబిలిటీ, తదితర గౌరవాలు అందుకున్నారు. పలు ఛాంపియన్‌షిప్స్ కైవశం చేసుకున్నారు.

విడాకులు తీసుకుని జంటగా మీడియా ముందుకు..

బెంగళూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సినిమా, టీవీ షో లలో ప్రత్యేకంగా పేరు తెచ్చుకున్న చందన్, నివేదిత గౌడ విడాకులు తీసుకున్నా మీడియా ముందుకు జంటగా వచ్చారు. మూడు రోజులకింద ఇరువురు కోర్టు ద్వారా విడాకులు పొందారు. వీరి విడాకులపై సోషల్ మీడియాతోపాటు పలు చానెళ్లలో వస్తున్న కథనాల మేరకు సోమవారం స్పందించారు. బెంగళూరులో చందన్, నివేదితగౌడలు మీడియా ముందుకు కలసి వచ్చారు. మా ఇద్దరిమధ్యన అన్యోన్యత లేదని, తరచూ గొడవలు జరుగుతుండేవన్నారు. పలుమార్లు కలసి కట్టుగా ఉండాలని ప్రయత్నం చేశామన్నారు. అయితే అది సాధ్యం కాలేదని అందుకే పరస్పరం అంగీకరించుకుని న్యాయ పరంగా విడాకులు పొందామన్నారు. మీడియా దాకా రావడం ఎందుకని అనుకున్నామన్నారు. అయితే సంబంధం లేని అంశాలను సృష్టించి సోషల్‌మీడియాలో పోస్టు చేస్తున్నారనే కారణంతో స్పష్టత ఇవ్వాలని వచ్చామన్నారు. మా ఇద్దరి జీవనశైలి వేర్వేరుగా ఉందని, పరస్పరం అర్థం చేసుకుని కలసి ఉండడం కష్టమైందన్నారు. ఇద్దరు కలిసే విడాకుల నిర్ణయం తీసుకున్నామన్నారు.

విడాకులు కోరుతూ నటుడు యువరాజ్‌కుమార్ అర్జీ

బెంగళూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కన్నడ కంఠీరవుడు డాక్టర్ రాజ్‌కుమార్ కుటుంబానికి చెందిన నటుడు యువరాజ్‌కుమార్ జీవితంలో మార్పులు చోటు చేసుకున్నాయి. భార్య శ్రీదేవి నుంచి విడాకులు కావాలని కోరుతూ సోమవారం కోర్టులో అర్జీ సమర్పించారు. ఆరు నెలలుగా యువరాజ్‌కుమార్, శ్రీదేవి వేర్వేరుగా ఉంటున్నారని తెలుస్తోంది. 2019లో మైసూరుకు చెందిన శ్రీదేవితో వివాహం జరిగింది. తాజాగా ఈ ఘటన సినీరంగంలో చర్చనీయాంశమైంది.

నెలాఖరుకు బన్నేరుఘట్టలో చిరుత సఫారి



వికాససౌధలో అధికారులతో మంత్రి ఈశ్వర్‌ఖండ్రె

బెంగళూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బన్నేరుఘట్ట జూ పార్కులో సింహాలు, పులుల సఫారితోపాటు నెలాఖరునుంచి చిరుత సఫారి కూడా ప్రారంభిస్తామని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె తెలిపారు. వికాససౌధలో సోమవారం 156వ జూ ప్రాధికార సదస్సు తర్వాత మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉండే జూలను సందర్శించేవారి సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మైసూరులోని చామరాజేంద్ర జూ, కారంగి చెరువు మధ్యలో పిపిపి పద్ధతిన అక్వేరియం నిర్మించదలిచామన్నారు. డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించామన్నారు. 15 రోజుల్లో నివేదిక రానుందన్నారు. బన్నేరుఘట్ట జూ పార్కులో పిపిపి పద్ధతిన ప్రత్యేక అక్వేరియంలు నిర్మించదలిచామన్నారు. జూలలో పనిచేసేందుకు పశువైద్యుల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బన్నేరుఘట్టలో వన్యప్రాణులు, పక్షులు, పర్యాటకులకు అనుకూలంగా ఉండాలని బెంగళూరు జలమండలినుంచి కావేరి నీటిని సమకూర్చేలా ప్రభుత్వం ఆదేశించిందన్నారు. పైప్‌లైన్‌లకోసం తవ్వకాల పనులు పూర్తయ్యాయన్నారు. జూ పార్కులో కంట్రాక్టు పద్ధతిన పనిచేసేవారికి నెలకు రూ.21వేలు లోపు జీతం తీసుకునేవారికి 157మందికి సీజీహెచ్‌ఎస్ ఫీజులతో వైద్యఖర్చులు భరించేలా తీర్మానించామన్నారు. జూ పార్కులో నిర్మిస్తున్న గద్దల సంరక్షణ, సంతానోత్పత్తి కేంద్రాన్ని శాటిలైట్ కేంద్రంగా మార్చదలిచామన్నారు. గదగ్ జూను విస్తరించేందుకు 13.20 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోదలిచామన్నారు. జూ సిబ్బందికి ఇంటిస్థలాలు ఇవ్వదలిచామన్నారు.

టెక్నో కల్చరల్ ఫెస్ట్‌లో విద్యార్థుల ఉత్సాహం

బెంగళూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జేబీ ఇంజనీరింగ్ కళాశాలలో టెక్నో కల్చరల్ ఫెస్ట్ ఉత్సాహంగా సాగింది. డాక్టర్ ప్రకాశనాథ స్వామిజీ పర్యవేక్షణలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మహేంద్ర ప్రశాంత్ నేతృత్వంలో ముఖ్య అతిథిగా ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ గుణశేఖర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్య సరళీకృతమైందన్నారు. ఒకప్పుడు ఇంజనీరింగ్ చదవాలంటే కొన్ని కళాశాలలే ఉండేవన్నారు. ప్రస్తుతం కళాశాలల సంఖ్య పెరగడంతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కోర్సులు వచ్చాయన్నారు. రెండు దశాబ్దాలలో ఇంజనీరింగ్ విద్యలో అనూహ్యమైన మార్పులు వచ్చాయన్నారు. ప్రస్తుతం ప్రపంచంతో పోటీపడేలా ఇంజనీరింగ్ విద్య కొనసాగుతోందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు పరిశోధనలవైపు ఆలోచించాలన్నారు. నారాయణ నేత్రాలయ సీఈఓ ఎస్‌కే మిట్టల్ ముఖ్యులుగా పాల్గొన్నారు. 5కే మారథాన్, రన్ ఫర్ సైట్‌తోపాటు పలు సాంకేతిక, సాంస్కృతిక సంబరాలు జరిగాయి. 3వేలమంది విద్యార్థులు భాగస్వామ్యులైనట్టు ప్రకటించారు.



కల్చరల్ ఫెస్ట్‌లో పాల్గొన్న ప్రముఖులు

నగరంలో బాలయ్య జన్మదిన సంబరాలు



హలసూరులో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

బెంగళూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నందమూరి నటసింహం, హిందూపురం హ్యాట్రిక్ ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన వేడుకలు బెంగళూరు నగరంలో అభిమానులు ఉత్సాహంగా జరుపుకొన్నారు. సోమవారం సాయంత్రం హలసూరులో యుగ స్టార్ ఎన్‌బీకే ఫ్యాన్స్ సభ్యులు కేక్ కట్ చేసి సందడి చేశారు. అభిమాన సంఘం ముఖ్యులు సూరి, అణ్ణప్ప, బాల, ఐరన్ రాజు, కిట్టి, శేషాద్రి శ్రీనివాస్‌లు ఉన్నారు. యలహంకలో జరిగిన కార్యక్రమంలో దేవాంగం పాపణ్ణ, పురుషోత్తం, రెడ్డెప్ప, అశోక్‌తోపాటు అభిమానులు పాల్గొన్నారు. బాలకృష్ణ, పవన్ కల్యాణ్ అభిమానులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, కేంద్ర విమానయానశాఖ మంత్రి రామమోహననాయుడు అభిమానులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ నగర్‌లో వేడుకలు

విజయనగర్, జూన్ 10: నందమూరి బాలకృష్ణ పుట్టినరోజును స్థానిక జగ్జీవన్ రాంనగర్‌లోని అభిమానులు సోమవారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి పిల్లలు, పెద్దలకు పంపిణీ చేశారు. అభిమానసంఘం పదాధికారులు డి సోమశేఖర్, నాగేశ్, శ్రీనివాసులు, అభిమానులు అక్కమ్మ, కదిరమ్మ, చిక్కమ్మ, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



యలహంకలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు



జగ్జీవన్‌రాం నగర్ వేడుకల్లో ఉత్సాహంగా అభిమానులు

మోదీ హ్యాట్రిక్ ప్రధాని కావడం హర్షణీయం



సమావేశంలో ఎమ్మెల్యే రవికుమార్ తదితరులు

శిడ్లఘట్ట, జూన్ 10: నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రి కావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ తెలిపారు. పట్టణంలోని బీజేపీ సౌధలో సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడుతూ వరుసగా నరేంద్ర మోదీ మూడుసార్లు ప్రధాని అయ్యారన్నారు. ప్రధాని మోదీ ఎన్నో సాధనలు చేశారన్నారు. 12వ శతాబ్దంలో బసవణ్ణ జగద్గురుగా పేరొందారని ఈ శతాబ్దంలో నరేంద్రమోదీని జగద్గురుగా పిలుస్తున్నారన్నారన్నారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ - జేడీఎస్ కూటమి 19 స్థానాలు సాధించిందని ఇందుకు సీఎం సిద్ద రామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు అన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో 135 స్థానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడను ఓడించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారన్నారు. అయితే ఈ సారి మాజీ సీఎం కుమారస్వామి కేంద్రమంత్రి అయ్యారన్నారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తారన్న విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో సీకల్ రామచంద్రగౌడ, మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ, జేడీఎస్, బీజేపీ నాయకులు బంకు మునియప్ప, డాక్టర్ ధనంజయ్‌రెడ్డి, శివారెడ్డి, నంజప్ప, నరేశ్‌తోపాటు పెద్దసంఖ్యలోకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

బాగేపల్లి, జూన్ 10: పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుట్టినరోజును విద్యార్థులు అర్థవంతంగా ఆచరించారు. సోమవారం పట్టణంలోని పిఎంశ్రీ బాలికల మోడల్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ హనుమంతరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు సుమారు 50 మొక్కలు నాటి ఆదర్శంగా నిలిచారు. మామిడి, పనస, బాదామి, నేరేడు, నల్లి తదితర రకాల 50కుపైగా మొక్కలు నాటి ఉపాధ్యాయుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం హనుమంతరెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణం, పచ్చదనం ఆవశ్యకతను తెలిపేలా విద్యార్థులు వ్యవహరించారని అభినందించారు. ఈ సందర్భంగా వైపి మంజునాథ్ గణేశ్, ఉపాధ్యాయులు ప్రభావతి, ధర్మపుత్రి, రూపా, కవిత, కల్పన, బేబి ముంతాజ్, భార్గవి, రాధికా, ముని లక్ష్మమ్మ, రజని తదితరులు పాల్గొన్నారు.

నగరేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు

శిడ్లఘట్ట, జూన్ 10: జ్యేష్ఠమాసం శుద్ధ చవితి సోమవారం పురస్కరించుకుని పట్టణంలోని అశోకరోడ్డులో గల పురాతనమైన నగరేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు సాగాయి. వేకువజామున ఆలయశుద్ధి, సుప్రభాతం, అనంతరం స్వామి వారికి అభిషేకం, మహాభిషేకం, తైలాభిషేకం, రుద్రాభిషేకం, స్పటికలింగ అభిషేక సేవలు నిర్వహించారు. 9 గంటల తర్వాత మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయంలోని దేవాతమూర్తులకు విశేషపూజలు నిర్వహించారు. కోటి సోమేశ్వరస్వామి ఆలయంలోనూ, కాశీ అన్నపూర్ణేశ్వర దేవాలయం, మయూర సర్కిల్‌లోని పార్వతీసమేత చంద్రశేఖర దేవాలయం, మల్లె మలేశ్వరస్వామి దేవాలయం, గవిగంగాధరేశ్వరస్వామి దేవాలయం తదితర ఆలయాల్లో విశేషపూజలు కొనసాగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

15న అన్నమయ్య పదార్చన

బెంగళూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వాగ్దేవి సంగీతాలయ ఆధ్వర్యంలో పద్మావతి కళానికేతన్ వార్షిక అన్నమయ్య పదార్చన ఈనెల 15న నిర్వహిస్తున్నట్టు వేణుగోపాల్ తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు తెలుగు విజ్ఞాన సమితిలో జరుగుతుందన్నారు. ముఖ్యులుగా సమితి అధ్యక్షులు రాధాకృష్ణరాజు, టీడీకి అనుబంధమైన హిందూ ధర్మప్రచార పరిషత్ ఆర్గనైజర్ డాక్టర్ పి.భుజంగరావు, కూచిపూడి కళాకారిణి లాస్య ఎడారలు పాల్గొంటారన్నారు.

జేఈఈలో ఆకాశ్‌కు నాలుగు టాప్ ర్యాంకులు

బెంగళూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ సంస్థకు చెందిన నలుగురు విద్యార్థులకు టాప్ ర్యాంకులు వరించాయి. ఈమేరకు స్థానిక ఆకాశ్ అకాడమీలో సంబరాలు చేసుకున్నారు. 67వ ర్యాంకును కృష్ణసాయి శిశిర్ సాధించగా, 78వ ర్యాంకులో అభిషేక్ జైన్, 421వ ర్యాంకును సాన్విజైన్, 896వ ర్యాంకులో మేఘరావ్‌లు నిలిచారు. వీరు ఆకాశ్ అకాడమీలో సాధకులుగా అకడమిక్‌హెడ్ ధీరజ్‌కుమార్ మిశ్రా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఆలోచనాశక్తి పోటీ పరీక్షల్లో పాల్గొనే తత్వాన్ని పెంపొందింపచేయడమే లక్ష్యమన్నారు. విద్యార్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసి ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు క్లాస్ రూంలోనే కాకుండా నిరంతరంగా అధ్యాపకులు అందుబాటులో ఉండి సందేహాలు తీరుస్తారన్నారు. ప్రతి సబ్జెక్టులోనూ ఎక్కువమార్కులు సాధించే దిశగా పోటీ తత్వాన్ని పెంపొందింప చేస్తామన్నారు. నలుగురు విద్యార్థులకు ర్యాంకులు రావడం సంతోషంగా ఉందన్నారు.



టాప్ ర్యాంకు విద్యార్థులకు సన్మానం

ప్రతిభా పురస్కారం అందజేత



ప్రోత్సాహక నగదు అందజేస్తున్న స్వామిజీ తదితరులు

బంగారపేట, జూన్ 10: పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో స్వర్ణభూమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వచనవైభవ మూడో వార్షిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో కన్నడ మీడియంలో రాణించిన విద్యార్థికి ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన దివ్యాంగ విద్యార్థి కేసీ చరణ్‌కు నాగలాపుర వీరసింహాసన సంస్థాన మఠం తేజేశలింగ శివాచార్య స్వామిజీ స్వయంగా సత్కరించారు. ప్రతిభావంత విద్యార్థి చరణ్‌కు సమాజసేవకురాలు పర్వత్ స్పోర్ట్స్‌కు చెందిన ఎం ఆనంద్‌రెడ్డి రూ.5,001, శాంతమ్మ రూ.2,001 ప్రోత్సాహకధనం అందచేశారు. కార్యక్రమంలో కసాప గౌరవ అధ్యక్షుడు టి సుబ్బరామయ్య, కసాప గౌరవ కార్యదర్శి కేఎస్ గణేశ్, జిల్లా కన్నడ రాజ్యోత్సవ పురస్కార గ్రహీత వీ లక్ష్మయ్య, స్వర్ణభూమి ఫౌండేషన్ సంస్థాపక అధ్యక్షుడు బి శివకుమార్, రంగభూమి డైరెక్టర్ డాక్టర్ ఇంచర నారాయణస్వామి, రోటరి రీజనల్ గవర్నర్ హెచ్ రామచంద్రప్ప, చుటుకు సాహిత్య పరిషత్ జిల్లాధ్యక్షుడు పి నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

దంత సమస్యలను నిర్లక్ష్యం చేయరాదు

మహదేవపుర, జూన్ 10: మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లతో ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతుందని దంత సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని ఎస్‌కే ఫౌండేషన్ అధ్యక్షురాలు శాంతాకృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. రామ మూర్తి నగర్‌లోని ఎన్ఆర్ఐ లే అవుట్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన శిబిరంలో పాల్గొని మాట్లాడుతూ ఇటీవలికాలంలో యువత దురలవాట్లకు లోనై ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసి ప్రాణాలు కోల్పోతున్నారని విచారం వ్యక్తం చేశారు. చక్కటి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం కాపాడుకోవాలని అభిప్రాయపడ్డారు. శిబిరంలో ఈఎన్‌టీ పరీక్షలతోపాటు హృద్రోగం, నరాలు, దంత తదితర సమస్యలపై నిపుణులైన వైద్యులు పరీక్షలు చేశారు. కంటి, హృద్రోగం ఇతర శస్త్రచికిత్సలకు అవసరమయ్యే ఖర్చును ఫౌండేషన్ భరించ నుందన్నారు. శిబిరంలో ఫౌండేషన్ సంస్థాపక అధ్యక్షుడు కల్కెరె కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



దంతవైద్య శిబిరం

జేఈఈలో నారాయణ విద్యార్థుల ప్రతిభ

బొమ్మనహళ్ళి, జూన్ 10: జేఈఈ అడ్వాన్స్ పరీక్షా ఫలితాల్లో నారాయణ విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని కసవనహళ్ళిలో ఏర్పాటైన కార్యక్రమంలో అమోఘ అగర్వాల్‌కు 20వ ర్యాంకు సాధించగా ఓపెన్ కేటగిరిలో వెయ్యిలోపు ర్యాంకులలో పదిమంది రాణించారన్నారు. బాలసత్య శరవణన్, ప్రణవ్ రితిల్, ఆర్యన్ చక్రవర్తి, కుశాల్ లక్ష్య తివారి, వరుణ్ బాత్రా, అనీష్‌డాడి, వినీల్‌రెడ్డి, అవి షా, అమృత్‌లు ర్యాంకులు సాధించారన్నారు. ఈ సందర్భంగా నారాయణ డీన్ సురేంద్రనాథరెడ్డి మాట్లాడుతూ నీట్, కామెడ్‌కె, జేఈఈ ఫలితాల్లో కూడా నారాయణ విద్యార్థులు సత్తా చాటుకున్నారన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సింధూరి, బెంగళూరు దక్షిణ విభాగం ఏజీఎం రూప, బాషా, బాబురెడ్డి, ప్రిన్సిపాల్ గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.



రాణించిన విద్యార్థులతో నిర్వాహకులు

కామసముద్రలో కరగ మహోత్సవం

బంగారపేట, జూన్ 10: తాలూకాలోని కామసముద్ర గ్రామంలో ధర్మరాయస్వామి దేవస్థాన సమితి నేతృత్వంలో కరగ మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. కరగను ధరించిన పూజారి పురవీధులలో నృత్యం చేస్తూ సాగగా భక్తులు స్వాగతించారు. సోమవారం వేకువజాము వరకు ఊరేగింపు సాగింది. చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో కరగ ఉత్సవంలో పాల్గొన్నారు.

అటవీ అధికారికి తాబేలు అప్పగింత

విజయపుర, జూన్ 10: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని ఇందిరానగర్ ప్రాంత లారీ డ్రైవర్ పిళ్ళప్పకు లభించిన తాబేలును సోమవారం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. శనివారం వర్షం కురుస్తున్న వేళ కోలారు రోడ్డుపై సుమారు ఏడాది వయసున్న తాబేలును గుర్తించిన లారీ డ్రైవర్ పిళ్ళప్ప రక్షించారు. ఈ మేరకు అటవీశాఖ విజయపుర శాఖ ఉపవలయ అరణ్యాధికారి రెహమాన్‌కు సమాచారం అందించారు. సోమవారం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. రెహమాన్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కడెక్కడనుంచో తాబేళ్లు సహజంగానే ప్రకృతిని ఆస్వాదించేందుకు రోడ్లపైకి వస్తుంటాయని వాటిని రక్షించడం అభినందనీయమన్నారు. తాలూకాలోని కోడిమంచేనహళ్ళి అటవీ ప్రదేశంలోని చెరువులోకి తాబేలును వదలనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్, వెంకటేశ్, మునేగౌడ తదితరులు పాల్గొన్నారు.